AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
25-5-2026 (Monday) MAIN EDITION

## ఇంధన ధరల పెరుగుదలపై రాహుల్ గాంధీ విమర్శలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో ఇంధన ధరల పెరుగుదలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై విమర్శలు చేశారు. ద్రవ్యోల్బణ సూత్రధారి మోదీ మళ్లీ తన పని మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. పెట్రోల్‌డీజిల్ ధరలను విడతల వారీగా పెంచుకుంటూ పోతున్నారని పేర్కొన్నారు. ప్రజల జేబును నిశ్శబ్దంగా దోచుకుంటూనే ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఆర్థిక సంక్షోభం గురించి తాను నెలల తరబడి హెచ్చరిస్తూనే ఉన్నానని తెలిపారు. కానీ మోదీజీ, ఎప్పటిలాగే, అప్పుడు ఎన్నికలతో తీరిక లేకుండా ఉన్నారని విమర్శించారు.

## సిలిండర్ పేలుడు.. ఒకరికి తీవ్ర గాయాలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని కాప్రా చౌరస్తాలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో తెల్లవారుజామున సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిపై శకలాలు పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. గ్యాస్ లీకేజీయే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చాయి.

## మేఘాలయలో సైనిక బలగాల విన్యాసాలు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: మేఘాలయలో 12 మిత్రదేశాల సైనిక బలగాలు 'ప్రగతి 2026' విన్యాసాల్లో పాల్గొన్నాయి. కొండలు, అడవుల వంటి క్లిష్ట ప్రాంతాల్లో పరస్పర సమన్వయం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా సైనికులకు శిక్షణ ఇస్తున్నారు. వివిధ అంశాలతో పాటు ఏకే-203 ఫైరింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు.

## 'రైతు గోస - బీజేపీ భరోసా' యాత్ర..



అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ నేతలు 'రైతు గోస - బీజేపీ భరోసా' యాత్ర కార్యక్రమం చేపట్టారు. రైతన్నల గోస తీర్చేందుకు.. వారి తరఫున మేమున్నాం అని భరోసా కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సారథ్యంలో యాత్రలో ప్రారంభించారు.

## ఓఆర్ఆర్‌పై మరో ఘోర రోడ్డు ప్రమాదం



అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శామీర్ పేట్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని డీసీఎం వెనుక నుంచి ఢీకొట్టింది. కాగా.. ప్రమాదంలో డీసీఎంలో ఉన్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి తీవ్ర గాయాలయ్యాయి.



## నీట్ పేపర్ లీకేజీ.. ఎన్‌టీఏపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**అక్షరటుడే, ఢిల్లీ:** పేపర్ లీక్ కారణంగా నీట్‌యూజీ 2026 పరీక్షను రద్దు చేయాల్సి రావడంపై సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. నీట్ పేపర్ లీకేజీపై దాఖలైన పిటిషన్‌పై సోమవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. రెండేళ్ల క్రితం జరిగిన పేపర్ లీక్‌కు సంబంధించి 2024లో కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గుణపాఠం నేర్చుకోలేదని న్యాయస్థానం పేర్కొంది. ఎన్‌టీఏ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌టీఏను మార్చాలని కోరుతూ వైద్యులు, వైద్య విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు నోటీసు జారీ చేసింది. నీట్ యంత్రాంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు సూచించడం కోసం కోర్టు 2024 తీర్పు ప్రకారం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు తీసుకున్న చర్యలపై ఎన్‌టీఏ నుంచి ఒక నివేదిక కోరింది.

## 'పెట్రోల్ ధర పెంచి రూ.43 లక్షల కోట్లు లూటీ'

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సామాన్య ప్రజల కష్టార్జితాన్ని, పొదుపు మొత్తాలను తగలబెట్టేందుకు మోదీ సర్కారు పెట్రోల్ చల్లుతోందని ఆయన ఘాటుగా విమర్శించారు. గడిచిన రెండు వారాల వ్యవధిలోనే ఇంధన ధరలను పెంచడం ఇది నాలుగో సారి అని, ఈ రోజువారీ దోపిడీకి అంతం లేకుండా పోయిందని మండిపడ్డారు. గత 12 ఏళ్ల బీజేపీ పాలనలో ఇంధన ధరల పేరుతో మోదీ ప్రభుత్వం ఏకంగా రూ.43 లక్షల కోట్లను ప్రజల నుంచి వసూలు చేసిందని ఖర్గే విరుచుకుపడ్డారు.

## రహస్య స్థావరంలో మొజ్తాబా ఖమేనీ..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం రహస్య ప్రాంతంలో తలదాచుకుంటున్నట్లు అగ్రరాజ్య ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1989 నుంచి ఇరాన్‌ను పాలించిన తన తండ్రి అయతొల్లా అలీ ఖమేనీ మరణించగా, మొజ్తాబా ఖమేనీ గాయాలతో బయటపడ్డారు. అప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించలేదు.




కేంద్ర ప్రభుత్వం వాహనదారులకు మళ్లీ షాక్ ఇచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచింది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం పడనుంది. 15 రోజుల వ్యవధిలో దేశంలో నాలుగు సార్లు ఇంధన ధరలు పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమాసియా సంక్షోభంతో ముడి చమురు ధరలు పెరిగాయి. అయినా ఇన్ని రోజులు చమురు సంస్థలు ధరలను పెంచలేదు. ఇటీవల పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే పెట్రో వడ్డింపునకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో తమ నష్టాలను భర్తీ చేసుకోవడానికి చమురు సంస్థలు ధరలను పెంచుతున్నాయి.

—అక్షరటుడే, నేషనల్ డెస్క్

# మళ్లీ పెట్రో బాదుడు

■ 15 రోజుల్లో నాలుగు సార్లు పెంపు ■ రానున్న రోజుల్లో మరింత పెరిగే ఛాన్స్ ■ ఆందోళనలో వాహనదారులు

దేశవ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి పెరిగిన పెట్రోల్ ధరలు అమలులోకి వచ్చాయి. పెట్రోల్ లీటర్‌కు రూ.2.84, డీజిల్ 2.86 చొప్పున పెంచుతూ ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రజల జేబులకు పెద్ద దెబ్బగా మారుతోంది. గత కొన్ని రోజుల వ్యవధిలోనే నాలుగు విడతల్లో ఇంధన ధరలు పెరగడంతో లీటరుకు దాదాపు రూ.7.38 వరకు అదనపు భారం పడింది. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న ధరలు కూడా చమురు సంస్థల నష్టాలను పూర్తిగా భర్తీ చేయలేకపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

### తీవ్ర ఒత్తిడి

ప్రభుత్వ రంగానికి చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలు అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదలతో భారీ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, దేశీయంగా వినియోగదారులపై వెంటనే భారం మోపకుండా ధరలను కొంతకాలం స్థిరంగా ఉంచడం వల్ల ఈ సంస్థలకు భారీ నష్టాలు వాటిల్లినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు దేశీయ రిటైల్ ధరల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా సరిచేయాలంటే లీటరుపై మరో రూ.20 నుంచి రూ.33 వరకు ధరలు పెంచాల్సిన అవసరం ఉండొచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే ఒకేసారి భారీ పెంపు చేస్తే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉన్నందున, దశలవారీగా పెంచే మార్గాన్ని ప్రభుత్వం పరిశీలించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

### ప్రస్తుతం ధరలు ఇలా..

తాజా పెంపు తర్వాత ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 102.12కు చేరింది. ముంబైలో రూ.111.21, చెన్నైలో రూ.107.77, విజయవాడలో రూ.117.19, హైదరాబాద్లో 115.58కి చేరింది. డీజిల్ ధర ఢిల్లీలో 95.20, ముంబైలో రూ.97.83, చెన్నైలో రూ.99.55, హైదరాబాద్‌లో 103.74కు చేరింది. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజల మంత్లీ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా ఆటోలు, క్యాబ్‌లు, ర్యాపిడో బైక్‌లు నడిపే వారి ఖర్చు పెరిగింది. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

రానున్న రోజుల్లో రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్



**అక్షరటుడే, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపించినా తాను రాజకీయాల్లో నుంచి తప్పుకుంటానన్నారు. దమ్ముంటే చూపించాలని సవాల్ చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. నగరంలో కొత్తగా ఒక్క ఇల్లు కట్టలేదన్నారు. కానీ హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకుందని, మనం కూడా వదిలించుకోవాలన్నారు. రాష్ట్రంలో తాము అధికారంలో ఉన్నప్పుడు 24 గంటల విద్యుత్ ఇచ్చినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచి కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని చెప్పారు. అప్పుడు హైదరాబాద్ నగరంలో 24 గంటల తాగునీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

## రైతుల పాలిట శాపంగా కాంగ్రెస్ పాలన: హరీశ్‌రావు



**అక్షరటుడే, సిద్దిపేట :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కల్లాల్లో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలను హరీశ్ రావు స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వడ్ల కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది మంది రైతులు ఇవాళ గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రైతులంటే పట్టింపు లేదు, లెక్కలేదన్నారు. యూరియా సరఫరా, కరెంటు, రైతుబంధు ఇవ్వడంలో ఫెయిల్ అయిన ప్రభుత్వం.. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను కొనడంలో కూడా పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

## ఇరాన్‌తో అమెరికా శాంతి ఒప్పందం.. తెరుచుకోనున్న హర్మూజ్

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇరాన్, అమెరికా మధ్య దాదాపు శాంతి ఒప్పందం ఖరారైంది. దీంతో హర్మూజ్ జలసంధి క్రమంగా తెరుచుకోనుంది. 60 రోజుల కాలవ్యవధిలో అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇరాన్-అమెరికా యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు భారీగా పెరిగాయి. దీంతో ద్రవ్యోల్బణంసైతం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో గ్యాస్, ముడి చమురు రవాణా నిలిచిపోయింది. ఈ క్రమంలో రెండు దేశాల చర్చల కోసం ప్రపంచం మొత్తం ఉత్కంఠగా చూస్తోంది. ఈ క్రమంలో శాంతి చర్చలు కొలిక్కిరావడం గమనార్హం.

### చర్చల దశలో..


యుద్ధ పరిష్కార ప్రయత్నాలలో అమెరికా, ఇరాన్ పురోగతిని సూచిస్తున్నప్పటికీ, ఒక



ఫ్రేమ్‌వర్క్ ఒప్పందానికి సంబంధించిన కీలక వివరాలు ఇంకా చర్చల దశలోనే ఉన్నాయి. దీనిని ఖరారు చేయడానికి మరికొన్ని రోజులు పట్టవచ్చని సమాచారం.

## ట్రావిస్ హెడ్ భార్యపై సోషల్ మీడియాలో వేధింపులు

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** సన్ రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ భార్యపై కొందరు సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడుతున్నారు. ఆమెపై అసభ్యకరంగా పోస్టులు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల ఎస్ఆర్‌హెచ్, ఆర్సీబీ మధ్య మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో హెడ్, కోహ్లీ మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాచ్ అనంతరం హెడ్‌కు విరాట్ షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు. ఈ క్రమంలో కోహ్లీ అభిమానులు ట్రావిస్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని ట్రోలింగ్ చేస్తున్నారు. తనపై దాడులు చేస్తామని బెదిరింపులతో పాటు, సన్నిహితులు, కుటుంబ సభ్యులపై ట్రోల్స్ చేస్తున్నారని ట్రావిస్ హెడ్ భార్య జెస్సికా హెడ్ ఆవేదన వ్యక్తం చేశారు.



## 'పెద్ది'లో వారిని కాదని శ్రుతి హాసన్‌కి ఛాన్స్..!

టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో వస్తున్న మూవీ 'పెద్ది'. అయితే ఈ సినిమా సాంగ్స్, కాస్టింగ్‌పై ఇండస్ట్రీలో పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమాలో స్పెషల్ సాంగ్ రేసులో మొదట మృణాల్ ఠాకూర్ లాంటి ఫుల్ క్రేజ్ ఉన్న స్టార్, లేదా మానస వారణాసి లాంటి ఫ్రెష్ ఫేస్ నటిస్తారని ప్రచారం జరిగింది. కానీ లాస్ట్ మినిట్‌లో శ్రుతి హాసన్ వైపు మొగ్గు చూపారు. ఇక దీనికి ప్రధాన కారణంగా డేట్స్ అడ్జస్ట్‌మెంట్ సమస్యలని తెలుస్తోంది. అలాగే ప్రొడక్షన్ లేట్ అవ్వడం వల్ల, రిస్క్ తీసుకోకుండా ఆల్రెడీ 'ఎవడు' సినిమాతో చరణ్‌కు హిట్ కాంబినేషన్ అయిన శ్రుతి హాసన్ వైపు వెళ్లినట్లు టాక్ నడుస్తోంది.

—అక్షరటుడే, సినిమాడెస్క్

